క్లుప్తంగా

మంత్రి రాజాను కలిసిన సీఐ విద్యాసాగర్



తునిలో మంత్రి రాజాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఐ విద్యాసాగర్

తుని: ఇటీవల పదోన్నతి పొందిన సీఐ విద్యాసాగర్ సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి రాజాకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి రాజా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా పని చేయాలన్నారు. విద్యాసాగర్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఎస్సైగా పని చేసి సీఐగా పదోన్నతి పొందడం అభినందనీయమన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సీఐకు సూచించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

గండేపల్లి: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-కాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ హరి సూచించారు. మండలంలోని మురారిలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును సోమవారం మండల ఏఓ సద్గురుమూర్తితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

రేపు మండల సమావేశం

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.గోవిందు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



బాలుడి తండ్రికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గోకవరం: మండలంలోని తంటికొండలో బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడి వైద్యానికి గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1992–97 బ్యాచ్ విద్యార్థులు రూ.28 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తాన్ని సోమవారం తంటికొండలో బాలుడి తండ్రి మారిశెట్టి శ్రీనుకి అందజేశారు. బాలుడు వైద్యానికి సుమారు రూ.8 లక్షలు వరకూ ఖర్చవుతుందని, దాతలు ఎవరైనా ఉంటే ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బద్దిరెడ్డి అచ్చన్నదొర, పంపన ధర్మరాజు, ముగడా వీరబాబు, నారా అమ్మనరాజా, నెల్లి దుర్గారావు, ముత్తా నాగేశ్వరరావు, మన్నే వెంకటకృష్ణ, దాసరి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ప్రత్తిపాడు: మండలంలో 2023 ఆగస్టు 12 నుంచి 22 వరకు జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆటవీశాఖ పనులపై ఈ నెల 23న సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్టు ఉపాధి ఏపీఓ ఏబీవీ నాయుడు సోమవారం తెలిపారు. మండలంలో జరిగిన ఉపాధి హామీ, ఆటవీ శాఖ పనులపై ఈ నెల 15 నుంచి గ్రామాల్లో సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామ సభలు నిర్వహించారన్నారు. తుది నివేదిక ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద జరుగనున్న సామాజిక తనిఖీ ప్రజా వేదికలో సమర్పిస్తారని ఏపీఓ నాయుడు తెలిపారు.

నేడు శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ

కిర్లంపూడి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా మంగళవారం రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తామని ఎంపీపీ తోట రవి సోమవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సమావేశపు హాలులో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు రైతులకు శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

ప్రజలు సోదరభావంతో మెలగాలి

శంఖవరం: గ్రామాల్లో ప్రజలు సోదరభావంతో మెలగాలని అన్నవరం ఎస్సై వి.కిశోర్‌బాబు సూచించారు. స్థానిక సచివాలయంలో సోమవారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ప్రమాదాల నివారణ, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ శాంతి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో ప్రజలు వివాదాలకు తావు లేకుండా ఐక్యమత్యంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, లైంగిక దాడులు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, వైఎస్సార్ సీపీ మండల మేనేజర్ బుర్ర లచ్చబాబు, ఎంపీటీసీ అడపా వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు జట్ల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగం.. అలంకారప్రాయం

- పలు గ్రామాల్లో షెల్టర్ల వద్ద ఆగని బస్సులు
- కనీస సౌకర్యాలు శూన్యం
- ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద లయన్స్‌క్లబ్ నిర్మించిన ఆర్టీసీ బస్సు షెల్టర్



హైవేపై బూరుగుపూడి వద్ద నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్సు షెల్టర్

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బస్సు షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో ఆర్టీసీ విఫలం కావడంతో బస్సు షెల్టర్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. దాతలు నిర్మించిన ఈ షెల్టర్లపై ఆర్టీసీ నిర్లక్ష్యం కనబరచడంతో అవి క్రమేపీ నామరూపాల్లేకుండా పోతున్నాయి. పల్లె ప్రజలకు మాత్రం బస్సుల కోసం ఎండలో, వానలో నిరీక్షణ తప్పడం లేదు.

దాతలు నిర్మించిన షెల్టర్లే...

ప్రత్తిపాడు మండలంలోని ప్రత్తిపాడు, ఏలూరు, ఒమ్మంగి, వెంకటనగరం, శాంతి ఆశ్రమం, శరభవరం, పెద్దిపాలెం తదితర గ్రామాల్లో దాతలు తమ సొంత నిధులతో బస్సు షెల్టర్లను నిర్మించారు. ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిత్యం రోగులు బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. వీరి కోసం ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ సభ్యులు ఆస్పత్రి వద్ద బస్సు షెల్టర్‌ను నిర్మించారు. చాలా కాలం ఈ షెల్టర్ వద్ద బస్సులు ఆగేవి. కాలక్రమేణా బస్సులను నేరుగా ఆస్పత్రి గేటు వద్ద నిలుపుదల చేస్తున్నారు. దీంతో రోగులు, ఆస్పత్రికి వచ్చేవారు గేటు వద్దే బస్సుల కోసం నిలబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దాతలు నిర్మించిన బస్సు షెల్టర్ మాత్రం నిరుపయోగకరంగా మారింది. బస్సులను షెల్టర్ వద్ద నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఏలూరులో బస్సు షెల్టర్‌కు గ్రామస్తులే మరమ్మతులు చేయించారు. కానీ ఈషెల్టర్ వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. శరభవరంలో దాత ఇచ్చిన స్థలంలో బవురువాక వెళ్లే రోడ్డులో ఆర్టీసీ షెల్టర్ ఉండేది. రిపేర్లు చేపట్టకపోవడంతో ప్రస్తుతం అక్కడ బస్సు షెల్టర్ ఆనవాళ్లే లేవు. పెద్దిపాలెంలో వారపు సంత వద్ద నిర్మించిన బస్సు షెల్టర్ మరమ్మతులు లేక శిథిలస్థితికి చేరుకుంది. గ్రామంలోని పాఠశాల వద్ద ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేస్తున్నారు. ప్రయాణికులు ఎక్కువగా బస్సుల కోసం ఇక్కడే వేచి ఉంటారు. బడి వద్ద బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

శాంతి ఆశ్రమం బస్సు కాంప్లెక్స్ కబ్జా

ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన శాంతి ఆశ్రమం బస్సు కాంప్లెక్స్ ఆక్రమణలకు గురైంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి శాంతి ఆశ్రమానికి భక్తులు వస్తుంటారు. అంతటి ప్రాధాన్యం కలిగిన శాంతి ఆశ్రమం బస్సు షెల్టర్ ఆక్రమణలకు గురైంది. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని అనేక పర్యాయాలు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ షెల్టర్ ఆక్రమణలకు గురికావడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

కోర్టును ఆశ్రయించిన గ్రామస్తులు

మండలంలోని ఒమ్మంగి బస్సు షెల్టర్ ఆక్రమణలో చెరలో కనుమరుగైంది. గ్రామంలోని ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోర్టును ఆశ్రయించడంతో అధికారులు ఆక్రమణలు తొలగించారు. దీంతో గ్రామంలో దాత నిర్మించిన బస్సు షెల్టర్ వెలుగులోకి వచ్చింది. ఇప్పటికైనా ఆర్టీసీ యాజమాన్యం స్పందించి, పల్లెల్లోని బస్సు షెల్టర్లను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఏలేశ్వరం మండలం తిరుమాలి జంక్షన్ వద్ద ఉన్న బస్సు షెల్టర్ మినహా జడ్డంగి అన్నవరం, యర్రవరం, శంఖవరం బస్సు షెల్టర్ల వద్ద ప్రయాణికులకు కనీస వసతులు లేవు. జాతీయ రహదారిపై జగ్గంపేట నుంచి ప్రత్తిపాడు నియోజకవర్గం శివారు వరకూ రామవరం, బూరుగుపూడి, కృష్ణవరం, కొడవలి, చెందుర్తి తదితర చోట్ల నిర్మించిన బస్సు షెల్టర్ల వద్ద ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు ఆగవు. ఈ షెల్టర్లకు కాస్త దూరంగా బస్సులను నిలుపుదల చేయడంతో ఎండలో, వానలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



గ్రామాల్లోని ఆర్టీసీ బస్సు షెల్టర్లకు మరమ్మతులు చేయించాలి. నిత్యం వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు బస్సు, ఆటో తదితర వాహనాల కోసం ఎండలో, వానలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బస్సు షెల్టర్లకు మరమ్మతులు చేయించి బెంచీలు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉంటాయి.

– దాడిశెట్టి చక్రధర్, ఏలూరు, ప్రత్తిపాడు మండలం

శాంతి ఆశ్రమంలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి



వెంకట నగరం పంచాయతీ పరిధిలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా బాసిల్లుతున్న శాంతి ఆశ్రమానికి జిల్లా నుంచే గాక రాష్ట్రం నలుమూలల నుంచి నిత్యం ఆధ్యాత్మిక వేత్తలు, భక్తులు వస్తుంటారు. పర్వ దినాల సమయంలో విదేశాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఇక్కడ బస్సు షెల్టర్‌ను పునరుద్ధరించాలి.

– కర్రి ఉమ, వెంకటనగరం గ్రామ పంచాయతీ, ప్రత్తిపాడు మండలం

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఒమ్మంగిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఒమ్మంగిలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, వైఎస్సార్ సీపీ నేతలు రామిశెట్టి బులిరామకృష్ణ, గోపు వీరబాబు, కొప్పన సుబ్బారావు తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, వైఎస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, ఏఎంసీ చైర్మన్ శేరు కృష్ణ, ఎంపీటీసీ సాధనాల అప్పారావు, సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్, రామిశెట్టి దొరబాబు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఒమ్మి రఘురాం కోరారు. స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ చంద్రనాయుడు అధ్యక్షతన కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉత్తమ కళాశాలగా పేరు పొందడంతో దూర ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలి వస్తున్నారన్నారు. విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం ఉందని తెలిపారు. మరిన్ని మౌలిక వసతుల కల్పనకు కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు, కాట్రావులపల్లి సర్పంచ్ సుగుణరావు, చాంబర్ కామర్స్ అధ్యక్షుడు పాలకుర్తి సురేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త కొండబాబు, వైఎస్సార్ సీపీ నేత కరుటూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతును దైవంగా కొలిచే రోజులు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ప్రత్తిపాడు రూరల్: రైతు లేకుంటే తినేందుకు ఆహారం ఉండదని, అటువంటి రైతులను దేవుళ్లగా కొలిచే రోజులు రావాలని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ధర్మవరంలో ఆయన కౌలుకు తీసుకున్న 12 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో సోమవారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు విద్యార్థులు, రైతులతో కలిసి ఆయన వరి నాట్లు వేశారు. అనంతరం ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. దివిలి సాధన పబ్లిక్ స్కూల్, వైజాగ్ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు, రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సేంద్రియ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎటువంటి హాని ఉండదన్నారు. జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో చెక్కపల్లి సత్తిబాబు, డాక్టర్ పుణ్యమంతుల రవి, చెక్కపల్లి నూకరాజు, సానా నూకరాజు, దొడ్డిపట్ల సోమన్నదొర తదితర రైతులు పాల్గొన్నారు.

దుర్గా ఎంఎస్ పేరుతో రుణం పొందిన కొత్త సంఘం సభ్యులు

గండేపల్లి: ఓ మహిళా శక్తి (ఎంఎస్) సంఘం పేరుతో కొత్త సంఘ సభ్యులు రుణం పొందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెలుగు ఏపీఎం సన్యాసిరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మురారి గ్రామానికి చెందిన దుర్గ ఎంఎస్ సంఘం సభ్యులు రాజానగరం ఎస్‌బీఐలో ఖాతా ప్రారంభించి లావాదేవీలు జరిపేవారు. బ్యాంకు దూరంగా ఉండటంతో బ్యాంకులో ఉన్న అప్పును క్లోజ్ చేసి మురారి గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఖాతా తెరిచారు. ప్రభుత్వం అందిస్తున్న ఆసరా సొమ్ములు నిమిత్తం దుర్గ ఎంఎస్ సంఘ పేరున ఉన్న పొదుపు ఖాతాను క్లోజ్ చేయలేదు. అదే సంఘంలో చేరిన కొత్త సభ్యులు యానిమేటర్ల సహాయంతో రూ.10 లక్షల రుణం పొందారు. దీనిని పాత సంఘం సభ్యులు వ్యతిరేకించడంతో రుణం పొందిన సభ్యుల నుంచి సొమ్ములు బ్యాంక్‌కు చెల్లించి దుర్గ పేరుతో ఉన్న ఖాతాను క్లోజ్ చేయించారు.

వివాహిత అదృశ్యంపై కేసు

గండేపల్లి: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై గణేష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని జెడ్ రాగంపేటకు చెందిన కంటే కాశి అన్నపూర్ణ, రాజమహేంద్రవరానికి చెందిన రాయి ప్రదీప్ ప్రేమ వివాహం చేసుకుని అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ నెల 18న ఉదయం కాశి అన్నపూర్ణ పుట్టింటికి జెడ్.రాగంపేట వెళ్లి వస్తానని చెప్పి రాజమహేంద్రవరంలో ఇంటి నుంచి బయలుదేరింది. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. అయినప్పటికీ ఆచూకి లభించకపోవడంతో ఆమె భర్త ప్రదీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గండేపల్లి: సైబర్, లోన్‌యాప్‌ల మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు సూచించారు. మండలంలోని తాళ్లూరులో సోమవారం రాత్రి సైబర్ నేరాలు, లోన్‌యాప్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతు ఎవరైనా బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని కాల్ చేసి ఓటీపీ అడిగితే చెప్పకూడదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుల క్లీనింగ్‌కు స్పెషల్ డ్రైవ్



టీజే నగరంలో వాటర్ ట్యాంకు క్లీనింగ్ రికార్డును పరిశీలిస్తున్న ఈఈపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా వాటర్ ట్యాంకుల క్లీనింగ్‌కు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఈఈపీఆర్డీ అరుణ్‌కుమార్ తెలిపారు. టీజే నగరం, ఇండుగపల్లి, బొద్దవరం, కోటనందూరు, కాకరాపల్లి, అల్లిపూడి, పాత కొట్టాం గ్రామాల్లోని వాటర్‌ట్యాంకుల క్లీనింగ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ట్యాంకుల క్లీనింగ్ రికార్డులు పరిశీలించారు. మంచినీటి ట్యాంకుల శుభ్రతలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 24 వరకూ వాటర్ ట్యాంకుల క్లీనింగ్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. మండలంలో 18 ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్ఎస్ఆర్), 8 గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్ (జీఎల్ఎస్ఆర్)లను శుభ్రపరుస్తామని వివరించారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు



తునిలో సీసీ డ్రైన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి తెలిపారు. సోమవారం స్థానిక 1వ వార్డు రెల్లి కాలనీలో సీసీ డ్రైన్ నిర్మాణానికి పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో పట్టణంలో ప్రధాన సమస్యలను పరిష్కరించి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దు తున్నామన్నారు. పట్టణాభివృద్ధికి, పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, వైఎస్సార్ సీపీ తుని పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, ఎస్సీ సెల్ కన్వీనర్ బోడపాటి శ్రీను, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంకు సేవలను వినియోగించుకోండి



రౌతులపూడిలో సెంట్రల్ బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

రౌతులపూడి: సెంట్రల్ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సూచించారు. రౌతులపూడి సినిమా హాలు సెంటర్‌లో సెంట్రల్ బ్యాంకు బ్రాంచిని సోమవరం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు వినియోగదారులు సక్రమంగా తమ ఆర్థిక లావాదేవీలు చేసుకోవాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తూ క్రమం తప్పకుండా పొదుపు ఖాతాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, వైస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ



తొండంగి హైస్కూల్లో విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందించిన నాయకులు, దివీస్ ప్రతినిధులు

తొండంగి: స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు సోమవారం స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. దివీస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన వాటర్ బాటిళ్లను వైస్ ఎంపీపీ యాదాల రమణ, సర్పంచ్ సోమాల ప్రసాద్ తదితరులు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా దివీస్ ప్రతినిధి ఈఎస్ నాగరాజు మాట్లాడుతూ మండలంలోని జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులకు రూ.20 లక్షల విలువైన 7906 స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశామన్నారు. ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ సంస్థలు అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దడాల విజయబాబు, దివీస్ ప్రతినిధులు బి.వాసుబాబు, ఎస్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు కృషి



జగనన్న కాలనీలో వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ సత్యనాగేశ్వరరావు తదితరులు

తుని రూరల్: జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరం జగనన్న కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించే వాటర్ ట్యాంకు పనులకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ నిధులతో బోరుబావి, 1.20 లక్షల నీటి నిల్వ సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మించనున్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రత్యేక శ్రద్ధతో ఈ నిధులు మంజూరైనట్టు ఆయన తెలిపారు. కాగా జగనన్న కాలనీలో 1064 ఇళ్లు నిర్మిస్తుండగా గృహాలన్నింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎ.శివాజీ తెలిపారు. ఎంపీటీసీ వంగలపూడి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కుసనం దొరబాబు, వంగలపూడి జమీలు, గంటా చక్రరావు, వంగలపూడి వాసు, కార్యదర్శి మధుశేఖర్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

ఏలేశ్వరం: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) చైర్మన్ కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సహకార సంఘ భవనంలో సోమవారం త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందిస్తున్నామన్నారు. రైతులకు అవసమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌కు అన్నదాతలు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు సిరిపరపు రాజేష్, దాసరి రమేష్, సీఈఓ జ్యోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

తుని: తుని ఆర్టీసీ డిపో నుంచి పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ప్రతి శనివారం ఉదయం ఆరు గంటలకు తుని డిపో నుంచి వాడపల్లికి ప్రత్యేక బస్సు వెళ్తుందన్నారు. ప్రతి మంగళవారం ఉదయం 5 గంటలకు తుని నుంచి సప్త శ్రీనివాసులు (తొలి తిరుపతి), వాడపల్లి, ర్యాలీ, కొడమంచిలి, అచ్చిరాజుపాలెం, అంతర్వేది, అప్పనపల్లికి బస్సు బయలుదేరుతుందన్నారు. ప్రయాణ చార్జీ రూ.500 ఉంటుందన్నారు. ప్రతి నెలా పౌర్ణమికి ముందు రోజు అరుణాచలం గిరి ప్రదర్శనకు బస్సు నడుపుతామన్నారు. ప్రయాణ చార్జీ రూ.3,500 అని తెలిపారు. టిక్కెట్లు కావాల్సిన భక్తులు 73829 13216, 73829 13016, 73829 21904 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రశ్నించిన వ్యక్తిపై దాడి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరుకు చెందిన కర్రి దుర్గా ప్రసాద్, భాస్కరరావు, దారపు వెంకటరెడ్డి, చల్లా శ్రీను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును ఉద్దేశించి బూతులు మాట్లాడుతున్నారు. అదే సమయంలో అటుగా వెళుతున్న సామన ప్రసాదరావు ఎందుకు తిడుతున్నారని అడగడంతో ఆ నలుగురు వ్యక్తులు అతని చేతిలో సెల్‌ఫోన్ లాక్కుని కర్రలతో ప్రసాదరావును కొట్టి గాయపరిచారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎన్‌సీసీ శిక్షణ కేంద్రం ప్రారంభం



శంఖవరంలో శిక్షణ కేంద్రం ధ్రువపత్రాన్ని ప్రిన్సిపాల్‌కు అందిస్తున్న ఎన్‌సీసీ అధికారులు

శంఖవరం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో ఎన్‌సీసీ శిక్షణ కేంద్రాన్ని కాకినాడ (3 ఏ) బాలికలు, బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ దుష్యంత్ కులశ్రేష్ఠ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రెండు సంవత్సరాలు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఈ ఏడాది 50 మంది, వచ్చే ఏడాది మరో 50 మంది విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు ఎన్‌సీసీ యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ జట్ల అప్పారావు, సుబేదార్ మేజర్ లక్ష్మణరావు, ట్రైనింగ్ జేసీఓ యాదవ్ పాల్గొన్నారు.

కుండపోత వాన

తుని: కొద్దిరోజులుగా ఎండలు మండిపోవడంతో అల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. పట్టణంలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. పట్టణ పరిధిలోని రహదారులు నీటితో నిండి పోయాయి. వాహన చోదుకులు ఇబ్బందులు పడ్డారు. జీఎన్‌టీ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కొండవారిపేట అండర్ పాస్ నీటితో నిండిపోవడంతో రైల్వే ట్రాక్ ఆవతల ఉన్న పది వార్డులకు చెందిన ప్రజలు ఆర్వోబీ ద్వారా రాకపోకలు సాగించారు. గ్రామాల్లో ఎండిపోతున్న పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

భారీ వర్షం

తుని రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు గంటకుపైగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కుండపోత వర్షం కురిసింది. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కొంతకాలంగా వర్షాలు లేక వరినారు మడులు సైతం ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ వర్షానికి ఆకుమడులకు ఊపిరి పోసుకుంటాయని రైతులు తెలిపారు. వేసవిని తలపిస్తూ ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



పెరుమాళ్లపురంలో రక్తదానం చేస్తున్న యువకులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. హార్వార్డ్ విద్యాసంస్థల నిర్వాహకుడు అప్పారావు వర్ధంతి సందర్భంగా హార్వార్డ్ పూర్వ విద్యార్థులు, స్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తొలుత అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోన ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కోన ప్రాంతానికి చెందిన 41 మంది రక్తదానం చేశారు. రక్త దాతలను స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి నేమాల శ్రీను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.